సాక్షి
విజయనగరం
ఆదివారం । 2 । జూలై । 2023

ఉచితంగా ప్రభుత్వ సేవలు

- దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సుపరిపాలన
- ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే అది సాధ్యం
- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వెల్లడి
- గ్రామగ్రామాన జగనన్న సురక్ష శిబిరాలు
- సమస్యల పరిష్కారంపై ప్రజల హర్షం



మెరకముడిదాం మండలం భైరిపురంలో మహిళకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ప్రభుత్వ సేవలను దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో మాత్రమే ఉచితంగా అందిస్తున్నారని, ఇది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలకోసం ప్రజలు దరఖాస్తు చేసే రోజులుపోయి... ఏ సేవలు అవసరమో ప్రజలవద్దకే వెళ్లి తెలుసుకునే పాలన అందుబాటులోకి వచ్చిందన్నారు. మెరకముడిదాం, గరివిడి మండలాల్లో జగనన్న సురక్ష క్యాంప్‌లను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ కార్యక్రమం ప్రారంభమైంది. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను నమోదు చేశారు. 11 అంశాలతో కూడిన ప్రభుత్వ సేవలను అందించారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు.

గ్రామ స్వరాజ్యం

చీపురుపల్లి మండలంలోని రావివలస, రామలింగాపురం, గరివిడి మండలంలోని కాపుశంభాం, చుక్కవలస, మెరకముడిదాం మండలంలోని భైరిపురం, బుధరాయవలస సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, చీపురుపల్లి మండలంలోని రావివలసలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరయ్యారు. ఎంపీ బెల్లాన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం సాకారమైందన్నారు.

11 రకాల సేవలు

రాజాం మండలం అంతకాపల్లి, బుచ్చింపేట గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే కంబాల జోగులు హాజరయ్యారు. 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. రేగిడి మండలం ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాధికారి కళ్యాణ చక్రవర్తి, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, సంతకవిటి మండలంలో వాసుదేవపట్నం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు పాల్గొన్నారు.

52వేల దరఖాస్తులు

- కలెక్టర్ నాగలక్ష్మి



జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్షా కార్యక్రమంలో సేవల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటవెంటనే ధ్రువపత్రాలను జారీ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించే సమయానికి ముందే వారి దరఖాస్తులను పరిష్కరించాలని, క్యాంపు తర్వాత ఏదీ పెండింగ్ ఉండకూడదన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1,2,3,4 సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చులయ, కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు పాల్గొన్నారు. కార్యక్రమ తీరుపై ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తోన్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంతవరకూ వివిధ ప్రభుత్వ సేవలకు 52 వేల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేటర్లు బి.ఆనంద్, అల్లు చాణుక్య, రాజేష్, సత్యగౌరి, ఎం.శ్రీను పాల్గొన్నారు.

కష్టాలు తప్పాయి..



గతంలో కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. తహసీల్దార్ కార్యాలయం నుంచి వాటిని పొందాలంటే వారం రోజులు పైగానే సమయం పట్టేది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న జగనన్న సురక్ష కార్యక్రమంలో మా ప్రాంతంలోకి వచ్చి నేరుగా ధ్రువీకరణ పత్రాలు అందజేయడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– జి.మణి. పూల్‌బాగ్‌కాలనీ, విజయనగరం

సమస్యలకు సత్వర పరిష్కారం



గజపతినగరం మండలం గంగచోళ్లపెంటలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గ్రామ స్థాయిలోనే అన్ని సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. గజపతినగరం మండలంలోని గంగచోళ్లపెంట, కొత్త శ్రీరంగరాజపురంపాటు దత్తిరాజేరు మండలంలోని కె.కృష్ణాపురంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంపుల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు బొండపల్లి మండలంలోని ఎం.కొత్తవలస, వెదురువాడ సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పలువురికి ధ్రువపత్రాలను అందజేశారు.

వ్యయప్రయాసలు తప్పాయి



నా పేరు చింత అంకప్ప. నా భర్త పేరు పొట్టోడు. కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసిన గంటల వ్యవధిలోనే జారీ చేశారు. గతంలో ఏ ధ్రువపత్రం కావాలనుకున్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వారాల తరబడి పనులు మానుకోని తిరిగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ వ్యయప్రయాసలు తప్పాయి. గ్రామంలోని సచివాలయంలోనే అన్ని ధ్రువపత్రాలు కూడా గంటలు వ్యవధిలోనే జారీ చేస్తున్నారు.

ముక్కాంలో...

భోగాపురం మండలంలోని ముక్కాం, పూసపాటిరేగ మండలం కనిమెల్లలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంప్‌ను నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సందర్శించారు. పలువురికి ఆదాయ, కుల, జనన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నెల్లిమర్ల మండలం అలుగోలు గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) సందర్శించారు.

సత్వరమే ఫ్యామిలీ మెంబర్ పత్రం

నా పేరు జాజిమొగ్గల కన్నమ్మ. పూసపాటిరేగ మండలం కనిమెల్ల గ్రామం మాది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫ్యామిలీ మెంబర్ పత్రం సత్వరమే మంజూరు చేశారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు.



కన్నమ్మకు ఫ్యామిలీ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

కోమటపల్లిలో శ్రీకారం



ఎమ్మెల్యే శంబంగి చేతులమీదుగా సర్టిఫికెట్‌ను అందుకుంటున్న దృశ్యం

బొబ్బిలి మండలంలోని కోమటిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా టోకెన్లు అందుకున్న పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాల నాయుడు, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ లబ్ధి



ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతుల మీదుగా ధ్రువపత్రాన్ని అందుకుంటున్న లబ్ధిదారు

జగనన్న సురక్షతో ఇంటింటికీ లబ్ధిచేకూరనుందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోట మండలం కొట్టాం, గోపాలపల్లి గ్రామాల్లోనూ, వేపాడ మండలం బొద్దాం, పాటూరు సచివాలయాల్లోను, కొత్తవలస మండలం వియ్యంపేట, వీరభద్రపురం, లక్కవరపుకోట మండలంలోని వీరభద్రపేట, కొట్యాడ సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎమ్మెల్సీ రఘురాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు తైనాల విజయకుమార్, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు హాజరయ్యారు.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి గుర్తింపు



సంస్కృత కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

విజయనగరం టౌన్: విజయనగరం మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల విద్యార్థులకు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. విద్యార్థులను కళాశాల ఆవరణలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.గౌరీశ్వరరావు శనివారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల భువనేశ్వర్ ఐఐటీలో ఏఐసీటీఈ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ క్యాంప్‌లో కళాశాల విద్యార్థులు ఎస్.కామేశ్వరి, శార్వాణి, వి.మల్లేశ్వరి, వి.నందు, కె.విజయ్ పాల్గొని ప్రతిభచూపి ప్రశంసలు అందుకున్నారన్నారు.

వెయిట్ లిఫ్టర్‌కు అభినందన

నెల్లిమర్ల రూరల్: జాతీయ స్థాయి ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్యపతకం సాధించిన నెల్లిమర్ల పట్టణానికి చెందిన బైరెడ్డి రాజేశ్వరిను జ్యూట్ కార్మిక నాయకుడు కిల్లంపల్లి రామారావు శనివారం అభినందించారు. నగర పంచాయతీ పరిధిలోని బైరెడ్డి వీధిలో రాజేశ్వరి నివాసానికి వెళ్లి దుశ్శాలువతో సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గురుకులాల్లో ప్రవేశానికి 4న కౌన్సెలింగ్

విజయనగరం పూల్‌బాగ్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో 2023–24 విద్యాసంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్‌లో అన్ని గ్రూప్స్‌లో మిగిలి ఉన్న సీట్ల కోసం ఈ నెల 4న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని గురుకులాల సమన్వయకర్త టి.పద్మజ తెలిపారు. బాలురకు కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలోను, బాలికలకు నెల్లిమర్లలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

వైద్యరంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర నాయుడు



విజయనగరం ఫోర్ట్: వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఇండియన్ మెడికల్ అసోసియేసిన్ రాష్ట్ర అధ్యక్షుడు ముర్రు జయచంద్రనాయుడు అన్నారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని ఆయన కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పెరగడం వల్ల ఎక్కువ మంది విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని వెల్లడించారు. వైద్యులు రోగుల ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించే విధానం గొప్పదన్నారు. 20 బెడ్స్‌తో ఉండే ఆస్పత్రులు, క్లినిక్‌లకు వివిధ నిబంధనల నుంచి మినహాయింపు ఇస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి 2008 సంవత్సరంలో దేశంలోనే మొదటిసారిగా వైద్యులు, ఆస్పత్రులపై దాడుల నిరోధానికి చట్టం తీసుకువచ్చారన్నారు. ఆ తర్వాత 14 రాష్ట్రాలు ఇదే విధమైన చట్టాన్ని అమలులోకి తెచ్చాయన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనైనా రోగుల ప్రాణాలు కాపాడడానికే వైద్యులు ప్రయత్నిస్తారని తెలిపారు. దేశ వ్యాప్తంగా 28 రాష్ట్రాల్లో 1700 శాఖల్లో 3,50,000 మంది సభ్యులు ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమాజంలో ప్రధాన భూమిక పోషిస్తోందని తెలిపారు.

అనాథలను ఆదుకోవడంలోనే సంతృప్తి



అనాథబాలలకు సమకూర్చిన నిత్యావసర సరుకులతో జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, గణేష్

- రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి

బొండపల్లి: అనాథులు, పేదలను ఆదుకోవడంలోనే సంతృప్తి లభిస్తుందని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి జన్మదినాన్ని మండలంలోని ఒంపల్లి గ్రామంలోని శాంతినివాస్ అనాథ ఆశ్రమంలో శనివారం నిర్వహించారు. అనాథ బాలలకు మిఠాయిలు పంచిపెట్టారు. 130 మంది అనాథలకు రూ.లక్ష విలువైన నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వాతిరాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా అనాథలు, వృద్ధులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుల్లిపల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలవాటిక-3 నోటిఫికేషన్ విడుదల

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం కేంద్రీయ విద్యాలయం (బాబామెట్ట)లో బాలవాటిక–3 తరగతిలో ప్రవేశానికి కేంద్రీయ విద్యాలయ సంగతన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలవాటికలో ప్రవేశానికి 5–6 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న చిన్నారులు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 6న ప్రారంభమై 18వ తేదీ నాటికి ముగుస్తుందన్నారు. విద్యార్థుల ఆన్‌లైన్ ఎంపిక ప్రక్రియ ఈ నెల 20న జరుగుతుందన్నారు. 29 నుంచి బాలవాటిక–3 తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. మరిన్ని వివరాలకు విద్యాలయ వెబ్‌సైట్ http://vizianagaram.kvr.ac.inను చూడాలని కోరారు.

ఆర్‌బీకేల్లో 33,997 క్వింటాళ్ల వరి విత్తనాలు

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు



విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాధారణ సాగు విస్తీర్ణం 93,572 హెక్టార్లు కాగా, 42,308 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని, ఇప్పటి వరకు 33,997 క్వింటాళ్ల విత్తనాలను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన విత్తనాలు మూడు, నాలుగు రోజుల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద 18, 500 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు మొలకశాతం పరీక్షించుకోవాలని సూచించారు. ఖరీఫ్–2022లో పంటలు నష్టపోయిన రైతులకు బీమా సొమ్మును ఈ నెల 8వ తేదీన రైతు దినోత్సవం రోజున రైతుల ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. భోగాపురం మండలంలోని ముంజేరు, జగ్గయ్యపేట గ్రామాల్లోని 323 మంది రైతులకు రూ.50.13 లక్షలు లబ్ధి చేకూరనుందని తెలిపారు.

పింఛన్ల పంపిణీలో స్టేట్ ఫస్ట్

- తొలిరోజు 90.31 శాతం మందికి పంపిణీ



విజయనగరం గొల్లవీధిలో ఈశ్వరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సౌజన్య



కొత్తపేట కాలనీలో పింఛన్ అందుకున్న ఆనందంలోవృద్ధురాలు మాణిక్యం

విజయనగరం అర్బన్:

వైఎస్సార్ పెన్షన్ కానుకల పంపిణీలో విజయనగరం జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. నెలలో తొలిరోజు శనివారం 90.31 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తిచేయడంతో జిల్లా ముందంజలో నిలిచింది. ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీని వలంటీర్లు ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందజేశారు. జిల్లాలో 14 రకాల పెన్షన్‌లు 2,76,498 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా, ఒక్కరోజులోనే 2,49,706 మందికి పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి తెలిపారు. కొత్తవలస, నెల్లిమర్ల అర్బన్‌లో 94 శాతం, విజయనగరం అర్బన్, విజయనగరం మండలంలో 93, రాజాం అర్బన్, బొబ్బిలి అర్బన్, గుర్ల మండలాల్లో 92, దత్తిరాజేరు, బొండపల్లి, డెంకాడ, ఎల్.కోట, తెర్లాం మండలాల్లో 91 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు వెల్లడించారు.

క్లుప్తంగా

పూరిల్లు దగ్ధం

● రూ.2లక్షల ఆస్తినష్టం



కాలి బూడిదైన పూరిల్లు, సామగ్రి

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేటలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు కాలిపోయింది. గ్రామానికి చెందిన మిత్తి రెడ్డి చిట్టిబాబు నివాసం ఉంటున్న పూరింటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంటిలో ఉన్న వంటసామగ్రి, బట్టలు, గ్యాస్,టీవీ, ఫ్రిజ్, డాక్యుమెంట్స్ కాలి బూడిదయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావుతో పాటు పలువురు పెద్దలు చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు.అయినా ఫలితం లేకపోయింది. రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు, స్థానికులు చెబుతున్నారు.

ఏపీపీఎస్సీ కంప్యూటర్ అసిస్టెంట్ జాబితా విడుదల

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2021 డిసెంబర్ 28న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది. దీనికి సంబంధించి ప్రొఫెషియన్సీ ఇన్ ఆఫీస్ ఆటోమెషన్ విత్ యూజ్ ఆఫ్ కంప్యూటర్ అసోసియేటెడ్ సాఫ్టవేర్ పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించి 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి విజయనగరం జిల్లా వెబ్‌సైట్‌లో జాబితాను పొందుపరిచినట్లు పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణ తేదీ, సమయం, ప్రదేశం తదితర వివరాలను తరువాత తెలియజేయనున్నామని వివరించారు.

320 లీటర్ల సారా స్వాధీనం



పట్టుబడిన సారా కేన్లతో ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, తదితరులు

పార్వతీపురం: సారా శిబిరాలపై దాడులను నిర్వహించి 320లీటర్ల సారాతోపాటు ఒకరిని అదుపులోకి తీసుకుని మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర శనివారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది దాడులను చేపట్టారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణ పరిధిలోని విజయరామరాజు కాలనీ సమీపంలో ఇసుక కుప్పలో సారా కేన్లను దాచారన్న సమాచారంతో విస్తృతంగా సోదా చేసి 320 లీటర్ల సారాతో కలిగి ఉన్న కేన్లను సీజ్ చేసి పట్టణానికి చెందిన డి. హరికృష్ణను అరెస్టు చేశారు. మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై రమణ, హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాస్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూనె మీద పడి మహిళకు తీవ్రగాయాలు



గాయాలపాలైన మహిళ

జామి: మండలంలోని భీమసింగి జంక్షన్‌లో పకోడీలు,బజ్జీలు అమ్ముకునే ఎన్.స్వాతి నూనె మీద పడడంతో శనివారం తీవ్ర గాయాలపాలైంది. జంక్షన్‌లో పకోడీలు వేస్తున్న సమయంలో కొత్తవలస నుంచి వస్తున్న లారీ అదుపుతప్పి పకోడీలు వేస్తున్న పొయ్యిని ఢీకొట్టడంతో వేడి నూనె ఆమెపై పడిపోంది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆమెను 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	58,960-00
బంగారం(22సి. 10గ్రా.)	54,050-00
వెండి (కిలో)	75,700-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

నిరీక్షణకు మోక్షం..!

- నెరవేరవనుకున్న ఆశలు సాకారం
- పాడి రైతుకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వం
- జిల్లాలో 2,884 పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారం
- ఆనందంలో లబ్ధిదారులు



మృతిచెందిన ఆవుకు పోస్టుమార్టం చేస్తున్న వైద్యాధికారి (ఫైల్)

రాజాం సిటీ: పాడి రైతులు ఇప్పటికే వదులుకున్న ఆశలకు జీవం పోసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. మూడేళ్ల క్రితం మృత్యువాత పడిన పశువులకు సంబంధిత రైతుల అకౌంట్‌లలో ఇప్పుడు నగదు జమ చేస్తున్నారు. దీంతో ఆయా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పాడి రైతులను ఆదుకునేందుకు పాడి పశువులకు ఉచితబీమా సౌకర్యం అమలు చేశారు. ఈ నేపథ్యంలో పశువైద్యాధికారులు లక్ష్యాలకు మించి బీమా చేయించారు. అయితే గడిచిన మూడేళ్లలో ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా సుమారు 7500 పాడి పశువులు మృతిచెందాయి. వాటికి ప్రభుత్వం కల్పించిన బీమా సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు బాధిత పాడి రైతులు పశువసంవర్థకశాఖలో దరఖాస్తు చేసుకున్నారు. రైతులకు మేలుచేయాలనే కుతూహలంతో అధికారులు దరఖాస్తు చేసినప్పటికీ లాక్‌డౌన్ కారణంగా ప్రయోజనం చేకూరలేదు. బీమా సంబంధిత పశువులన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ఆర్‌బీకే నిబంధనల ప్రకారం పీడీ అకౌంట్‌లో నిలుపుదల చేసింది. దీంతో వాటిలో జిల్లా వ్యాప్తంగా 2884 క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ నిధులపై సమీక్షించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాడి రైతులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో పీడీ అకౌంట్‌లో నిలిచిపోయిన నిధులను ట్రెజరీ అకౌంట్‌లోకి మళ్లించే చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు సంబంధిత పాడి రైతులకు దశలవారీగా నగదు జమచేసేందుకు చర్యలు చేపట్టారు.

రూ. 8.22 కోట్ల మేరకు జమ..

జిల్లాలోని సుమారు 2884 మంది పాడి రైతులకు సంబంధించి ఉచిత బీమా సొమ్ము రూ. 8.22 కోట్ల మేరకు వారి బ్యాంకు ఖాతాలకు దశలు వారీగా జమ అవుతుంది. పాడి ఆవులు అంతుపట్టని వ్యాధులతో మరణించడంతో రైతులు ఓ పక్క లబోదిబోమంటూనే బీమాకు దరఖాస్తు చేసుకున్నారు. గత మూడేళ్లలో బీమాకు నోచుకోని సుమారు 2,884 పాడి పశువులకు ట్రెజరీ ద్వారా ఆయా రైతుల ఖాతాలో పరిహారం జమచేస్తుండడంతో ఒకింత ఆశ్చర్యంతో పాటు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆశలు వదులుకున్నాం..



పాడిపైనే జీవనం సాగిస్తున్న మా ఆవులు మూడేళ్ల క్రితం లాక్‌డౌన్ ముందు వింత వ్యాధులు సోకి మృతిచెందాయి. పశువులు మరణించిన తరువాత బీమా సొమ్ముకు అధికారుల సూచనల మేరకు దరఖాస్తు చేసుకున్నాం. దురదృష్టవశాత్తు లాక్‌డౌన్ విధించడంతో బీమా సొమ్ము రాదనుకుని ఆశలు వదులుకున్నాం. ఇప్పుడు నా అకౌంట్‌లో రెండు ఆవులకు సంబంధించి బీమా సొమ్ము జమ అయింది.

శాసపు సత్తిబాబు, లబ్ధిదారు, పొనుగుటివలస, రాజాం

నమ్మకం కలిగింది..



మూడు సంవత్సరాల క్రితం మా గేదె మరణించింది. బీమా సదుపాయం ఉండడంతో రాజాం పశువుల ఆస్పత్రికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నాం. అప్పటి నుంచి అధికారులను సంప్రదిస్తూనే ఉన్నాం. డబ్బులు పడతాయని చెప్పేవారు కానీ ఎప్పుడు పడతాయో చెప్పకపోవడంతో నిరాశ చెందాను. ప్రభుత్వం చొరవ తీసుకుని పెండింగ్ క్లెయిమ్‌లు వేయడంతో నమ్మకం కలిగింది. నా అకౌంట్‌లో ఒక గేదెకు సంబంధించి నగదు జమ అయ్యింది.

ఆలుగుబిల్లి పైడిరాజు, పాడి రైతు, రాజాం.

రైతులు చెబితేనే తెలుస్తుంది..



గతంలో పాడి పశువులు మరణించిన వాటికి బీమా కోసం దరఖాస్తు చేశాం. ప్రస్తుతం ఆ క్లెయిమ్‌లకు సంబంధించి బిల్లులు నేరుగా సంబంధిత రైతు అకౌంట్‌లోకే జమ అవుతున్నాయి. వారి అకౌంట్‌లో నగదు జమ అయినట్లు రైతులు చెబితేనే తెలుస్తుంది. మిగిలిన క్లెయిమ్‌ల మొత్తం కూడా ఈ నెలాఖరునాటికి పరిష్కారం కానున్నాయి.

బి.జయప్రకాశ్, ఎ.డి., పశుసంవర్థకశాఖ, రాజాం

పవన్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు..!

- విలేకరుల సమావేశంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: రాజకీయ లబ్ధికోసం నలుగురు యువతను వెనుకేసుకోవాలనే ఉద్దేశంతో వారాహి పేరుతో లారీ ఎక్కి వస్తున్న పవన్‌కల్యాణ్‌కు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని నందిగాం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. మీ అన్న చిరంజీవి 19 సీట్లు గెలుచుకుని దిక్కుతోచని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. అప్పట్లో మీ అన్న చేసిన పనికి లక్షల సంఖ్యలో ఓటర్ల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. నేడు నువ్వు కూడా పిచ్చికూతలు కూసి రాజకీయ లబ్ధి పొందాలనే ఆశను విరమించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. ఈ మధ్య కాలంలో నెల్లిమర్ల నియోజకవర్గంలో మిరాకిల్ సంస్థ పేరుతో ఇద్దరు వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ గ్లాసు పాట పాడుతున్నారు. వారి పనివారు చేసుకోకుండా మాపై పిచ్చి కూతలు కూయడం సబబు కాదని హెచ్చరించారు. సంస్థ పేరు చెప్పి సుమారు 40 ఎకరాలకు పైగా ప్రభుత్వం భూమిని కబ్జా చేసి, వారి పరిధిలో ఉండే ప్రాంతాలకు ఒక్క రూపాయి కూడా సీఎస్ఆర్ నిధులు ఖర్చుచేయలేని వారు తమ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. వారి సంస్థలో పనిచేసే ఉద్యోగులను కూడా రాజకీయం కోసం వాడుకుంటున్నారని, సహకరించని ఉద్యోగులను విధుల నుంచి తప్పిస్తున్నారని, రానున్నరోజుల్లో దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎన్నికల ముందు డప్పులు కొట్టుకుని వీధుల్లోకి వచ్చి మాట్లాడే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండలకన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

14 తులాల బంగారం చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

రాజాం సిటీ: పట్టణపరిధి బొబ్బిలి రోడ్డులోని ఫైర్ స్టేషన్ సమీపంలో ఓ ఇంట్లో శుక్రవారం రాత్రి 14 తులాల బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్లు ఎస్సై వై.రవికిరణ్ శనివారం తెలిపారు. రెడ్డి నాగేశ్వరరావుకు చెందిన ఇంట్లోకి అర్ధరాత్రి దాటిన తరువాత వెనుక నుంచి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారన్నారు. తెల్లవారు జామున కుటుంబసభ్యులు లేచేసరికి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి దొంగతనం జరిగినట్లు తెలుసుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో క్లూస్ టీం సహాయంతో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తుచేపట్టి వివరాలు సేకరించామని ఎస్సై చెప్పారు. ఈ చోరీలో 14 తులాల బంగారంతో పాటు ఐఫోన్ పోయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శివాలయంలో హుండీ..

మండల పరిధి మొగిలివలస జంక్షన్ వద్ద ఇటీవల నిర్మించిన శివాలయంలో హుండీ చోరీకి గురైందని గ్రామానికి చెందిన లెంక సింహాద్రినాయుడు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. గత నెల 30న అర్ధరాత్రి దాటిన తరువాత ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగలగొట్టి హుండీ అపహరించుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. నూతనంగా ఆలయాన్ని నిర్మించడంతో ప్రస్తుతం హుండీలో రూ. 6వేల వరకు ఉంటుందని తెలిపాడని ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, క్లూస్‌టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించినట్లు ఎస్సై తెలిపారు.

సమాజానికి మంచి పౌరులను అందించడమే లక్ష్యం



చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజును సత్కరిస్తున్న స్కాలర్లు

- సెంచూరియన్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: విద్య ద్వారా సాధించలేనిది ఏదీ లేదని, సమాజానికి బాధ్యత గల పౌరులను అందించడమే లక్ష్యంగా పని చేస్తానని సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో నూతన చాన్స్‌లర్‌గా ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామన్నారు. ఇతర వర్సిటీలకు తీసిపోని రీతిలో సెంచూరియన్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సంప్రదాయ విద్యాలయాలకు భిన్నంగా ఇక్కడ బోధన సాగుతోందని తెలిపారు. ఈ-వాహనాలు, డ్రోన్లు, వ్యవసాయ గోపురాలు, రాకెట్ విడిపరికరాలు వంటివి తయారు చేయడం ద్వారా విశ్వవిద్యాలయం మరో ముందడుగు వేసిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన స్కాలర్లు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


గోస్తనీలో పడి యువకుడి మృతి



శృంగవరపుకోట: టేకు బోయిన నాయుడు మృతదేహం

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామానికి చెందిన యువకుడు ప్రమాదవశాత్తు గోస్తనీ నదిలో పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌కోట ఎస్సై తారకేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన టేకుబోయిన నాయుడు(23) గొర్రెల మందను శుక్రవారం మేతకు తోలుకువెళ్లాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు వెదకడం ప్రారంభించారు. ఈ క్రమంలో గోస్తనీనదిలోని గోతిలో పడి ప్రాణాలు వదిలినట్లు గుర్తించారు. దీంతో మృతుడి తండ్రి టేకుబోయిన చినకోటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోతిలో పడి మరో వ్యక్తి..



బొబ్బిలి: శ్రీనివాసరావు(ఫైల్)

బొబ్బిలి: విశాఖ నుంచి బైక్‌పై మండలంలోని గున్నతోట వలస వెళ్లే రహదారిలో ద్విచక్రవాహనంపై వస్తున్న గున్నతోట వలస గ్రామానికి చెందిన కెల్ల శ్రీనివాసరావు(54) రోడ్డు మలుపు పక్కనే ఉన్న కల్వర్టు గోతిలో పడి మృతి చెందినట్లు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు. విశాఖలో ఉంటున్న శ్రీనివాస రావు యాక్టివా బండిపై వస్తూ గ్రామం దగ్గరకు వచ్చాక ప్రమాదంలో తలకు గాయమై మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చదలవాడ తెలిపారు.

కొరటాంలో విషాదఛాయలు


తెర్లాం: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మా కంపెనీలో శుక్రవారం జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో తెర్లాం మండలం కొరటాం గ్రామానికి చెందిన ఉప్పాడ తిరుపతి(28) మృతి చెందిన విషయం తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



ఉప్పాడ తిరుపతి(ఫైల్)

గ్రామానికి చెందిన ఉప్పాడ తిరుపతి నాలుగేళ్లుగా అనకాపల్లి సెజ్‌లోని సాహితీ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో ఉండగా రెండు రియాక్టర్లు పేలి ఎగిసిపడిన మంటల్లో తిరుపతి చిక్కుకుని మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు అచ్యుతాపురంలో నివాసముంటున్నారు. గ్రామంలో మృతుని తల్లిదండ్రులు రాము, తొడమ్మ ఉంటున్నారు. ప్రమాదంలో కుమారుడు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండే తిరుపతి మృతి చెందడంతో గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు.

కారు బోల్తాపడి యువకుడు..



ఉదయకుమార్ (ఫైల్)

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో శుక్రవారం రాత్రి కారు బోల్తా పడడంతో బొబ్బిలికి చెందిన గుంటిరెడ్డి ఉదయ కుమార్(27) మృతిచెందాడు. మధురవాడ నుంచి రాత్రి సుమారు ఒంటి గంట ప్రాంతంలో అయిదుగురు స్నేహితులు కారులో బీచ్‌రోడ్డులో భీమిలి వస్తున్నారు. ఎర్ర మట్టి దిబ్బలు దాటిన తర్వాత అతివేగంగా వెళ్తున్న కారు సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఉదయకుమార్ తీవ్ర గాయలపాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ యువకుడు విశాఖలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. కారు నడుపుతున్న యదుభూషణ్‌కు చెయ్యి విరిగింది. కారులో ఉన్న వెంకటరమణ, ఆనందరాజు, శ్రావణకుమార్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం గీతం ఆస్పత్రికి తరలించారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేద్దామని భావించిన మహిళ మోసపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కణపాకకు చెందిన మల్లేశ్వరి మహిళల బ్యాగులు, బ్రాండెడ్ వస్తువుల అమ్మకాలు చేపట్టింది. ఈ నెల 20న ఆన్‌లైన్‌లో కొన్ని వస్తువులు ఆమెకు నచ్చడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించింది. 21వ తేదీన ఆ కంపెనీకి చెందిన వ్యక్తి ఫోన్ చేసి వస్తువుల ఫొటోలను వాట్సాప్ ద్వారా పంపించాడు. వాటిని బల్క్‌గా తీసుకువచ్చేందుకు కొంత నగదు పంపించాలని కోరాడు. అందుకు కొన్ని ఫేక్ సర్టిఫికెట్లు, బిల్లులు పంపించి నమ్మబలికాడు. దీంతో ఆమె మూడు దఫాలుగా రూ.లక్షా 13వేల 60 నగదు పంపించింది.తర్వాత అవి రాకపోయేసరికి ఫేక్ బిల్లులుగా గుర్తించి వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

విజయనగరం పూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయడానికి అర్హత గల పాఠశాల సహాయకుల తాత్కాలిక సీనియారిటీ జాబితాను, పాఠశాల సహాయకులు (మేథ్స్, ఇంగ్లీష్, పీడీ) పదోన్నతుల కోసం అర్హత గల ఎస్జీటీ అభ్యర్థుల తాత్కాలిక జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈఓ బి లింగేశ్వరరెడ్డి శనివారం ఒకప్రకటనలో తెలిపారు.కావున సదరు ఉపాధ్యాయులు గమనించి సీనియారిటీ లిస్టుపై తమ అభ్యంతరాలను డీఈఓ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. httpr://riter.goofe .com/rite/doevizianafaram/ వెబ్‌సైట్‌ను పొందుపరిచామని ఈనెల మూడోతేదీలోగా అబ్జెక్షన్స్ తెలియజేయాలని కోరారు. 4వతేదీన గ్రేడ్-2హెచ్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్కూల్అసిస్టెంట్‌లకు సంబంధించి ఈనెల 5వతేదీన కౌన్సెలింగ్ డీఈఓ కార్యాలయంలో ఉంటుందన్నారు. కావున సదరు సీనియారిటీ జాబితాలో గల ఉపాధ్యాయులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్, సర్వీస్ రిజిస్టరుతో హాజరుకావాలని స్పష్టం చేశారు.